క్లుప్తంగా

మొక్కలు నాటి సంరక్షిద్దాం



మొక్కలు నాటిన ఏఈ శ్రీనివాస్, సభ్యులు

సోన్: వనమహోత్సవంలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి సంరక్షిద్దామని ఏఈ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని జాఫ్రపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో వీడీసీ సభ్యులతో కలిసి సిబ్బంది వివిధ రకాల పండ్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

గౌడసంఘం కార్యవర్గం

లోకేశ్వరం: మండల కేంద్రంలోని గౌడ సంఘ భవనంలో శనివారం గౌడ సంఘం మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌడ సంఘం మండలాధ్యక్షుడిగా సుందగిరి ముత్తగౌడ్, ఉపాధ్యక్షుడిగా బాల పవన్‌గౌడ్, కార్యదర్శిగా ఎర్రోల్ల స్వామిగౌడ్, కోశాధికారిగా నాగుల హరిగౌడ్, సహాయ కార్యదర్శిగా సాగర్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గౌడ సభ్యులు ఉన్నారు.

‘నిరాశపర్చిన రాష్ట్ర బడ్జెట్’

ముధోల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశ కలిగించిందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గడపాలి పరమేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్కాలర్‌షిప్ మెస్ బిల్లుల గురించి బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం ఆందోళన కలిగించిందని పేర్కొన్నారు. విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఉత్తమ సేవలతో గుర్తింపు

మామడ: అంకితభావంతో ప్రజలకు ఉత్తమ సేవలు అందించే ఉద్యోగులకు సమాజంలో గుర్తింపు ఉంటుందని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. మామడలో విధులు నిర్వర్తించి వెంగ్వపేట్ పశువైద్యశాలకు బదిలీపై వెళ్లిన పశువైద్యాధికారి ఓంప్రకాశ్‌ను శనివారం శాలువాతో సన్మానించారు. దీనికి డీసీసీ అధ్యక్షుడు హాజరై మాట్లాడారు. అనంతరం మామడ పశువైద్యాధికారిగా మహేశ్ బాధ్యతలు స్వీకరించారు. కాంగ్రెస్ మండల కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

సప్తాహం ప్రారంభం

కుభీర్: మండలంలోని పార్డి(బి)గ్రామ రాజరాజేశ్వర మందిరంలో శనివారం తాళ సప్తాహం ప్రారంభమైంది. వారం రోజులపాటు జరిగే ఈ సప్తాహంలో చివరిరోజు ఉట్టి కొట్టి అన్నదానం చేస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు వి.మోహన్ తెలిపారు.

రోడ్డుకు మరమ్మతులు



మొరం చదును చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్

ఖానాపూర్: పట్టణంలోని ఐదోవార్డు పరిధి ఇంద్రనగర్, కరీంకాలనీల్లో రోడ్డుపై వర్షపునీరు నిలుస్తుండటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో స్పందించిన కౌన్సిలర్ పరిమి లతసురేశ్ సొంతఖర్చులతో మొరం పోయించి సమస్య పరిష్కరించారు. వారికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

పోస్టల్ పథకాలపై అవగాహన

ఖానాపూర్: తపాలాశాఖ ప్రవేశపెట్టిన పొదుపు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పోస్టల్ సబ్ డివిజన్ అధికారి సందీప్ అన్నారు. శనివారం మండలంలోని సుర్జాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో తపాలాశాఖ పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆకుల వెంకాగౌడ్, జంగిలి శంకర్, గాజుల గంగన్న, నర్సయ్య, శ్రీనివాస్, సిబ్బంది తదితరులున్నారు.

లక్ష్మీనరసింహుడికి పూజలు

కడెం: మండలంలోని దిల్దార్‌నగర్ సమీపంలోని అటవీ ప్రాంతంలో కొండపై కొలువుదీరిన శ్రీ అక్కకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు వొద్దిపర్తి వంశీకృష్ణమాచార్యులు లక్ష్మీనృసింహుడికి అర్చన, అభిషేకం, హారతి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదం అందజేశారు.

గోరింటాకు వేడుకలు



గోరింటాకు చూపుతున్న విద్యార్థినులు

భైంసాటౌన్: పట్టణంలోని గుజిరిగల్లి శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో శనివారం గోరింటాకు వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు గోరింటాకు విశిష్టతను విద్యార్థులకు వివరించారు. గోరింటాకు పెట్టుకుంటే శరీరంలో ఉష్ణం తగ్గి ఆరోగ్యం చేకూరుతుందని వివరించారు. కార్యక్రమంలో ఆచార్యులు ఉన్నారు.

ఎన్నాళ్లీ బురద కష్టాలు

- గ్రామాల్లో బురదమయంగా రోడ్లు
- డ్రెయినేజీలు లేక ప్రజలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు
- సమస్య పరిష్కరించాలని వేడుకోలు

లోకేశ్వరం: మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు సరిగా లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. డ్రెయినేజీలు లేకపోవడంతో ఏటా వర్షాకాలంలో రోడ్లు కుంటలను తలపిస్తున్నాయి. బురదమయంగా మారిన రోడ్లపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్ల సమస్య పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

లోకేశ్వరం మండలంలోని వట్టోలి, పంచగుడి, హథ్‌గాం, రాజూర, ధర్మోర, రాయపూర్‌కాండ్లీ తదితర గ్రామాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. వట్టోలి,మొహళ, రాజూర గ్రామాల్లోని డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేక రోడ్లు మురికి కూపాలుగా దర్శనమిస్తున్నాయి. రోడ్లపై నిలిచిన నీటితో దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు.



పంచగుడి నుంచి నందిపేట్ వెళ్లే ప్రధాన రోడ్డు దుస్థితి



బురదగా రాజూర నుంచి పొలాలకు వెళ్లే రోడ్డు



హథ్‌గాంలో బురద రోడ్డు

పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులే..

వట్టోలి, మొహళ గ్రామాల్లో రైతు కుటుంబాలే ఎక్కువ. వీరు పంటపొలాలకు వెళ్లేందుకు సరైన రోడ్లు లేవు. ఉపాధిహామీ పథకం నిధులతో గ్రామాల్లో మట్టిరోడ్డు ఏర్పాటు చేసుకున్నా.. పంటలను ఇళ్లకు తరలించేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. బండ్లబాట బురదగా మారుతుందని.. మొరం పోయించాలని కోరినా.. అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

రోడ్లపైనే మురుగు నీరు



గ్రామంలో సరైన సీసీ రోడ్లు, మురికికాలువలు లేవు. పలు చోట్ల రోడ్లు శిథిలావస్థకు చేరాయి. జనావాసాల మధ్య మురుగునీరు నిలిచి ఉంటుంది. దీంతో దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నాం. – చిన్నారెడ్డి, ధర్మోర

డ్రెయినేజీలు లేవు



గ్రామంలో చాలా చోట్ల డ్రెయినేజీలు నిర్మించలేదు. రోడ్లపై నిలిచే నీటితో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. దోమల నివారణకు చర్యలు చేపట్టాలి. అధికారులు సమస్యలు పరిష్కరించాలి. – ప్రవీణ్, రాయపూర్‌కాండ్లీ

ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతాం

వట్టోలి, పంచగుడి, హథ్‌గాం గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలను కొంత చేపట్టాం. మిగతా గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతాం. – రఘువంశీ, పీఆర్ ఏఈ, లోకేశ్వరం

పాఠశాలల్లో బోనాల సందడి



నిర్మల్‌లోని విజయ హైస్కూల్‌లో..



జిల్లాకేంద్రంలోని వశిష్ట ఇంపల్స్ పాఠశాలలో..



లక్ష్మణచాంద: కనకాపూర్ అక్షర పాఠశాలలో..

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. విజయ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు బోనాల పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులు గోరింటాకు వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ సామ మోహన్‌రెడ్డి, కరస్పాండెంట్ నాగభూషణం, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని వాగ్దేవి హైస్కూల్‌లో నిర్వహించిన బోనాల వేడుకల్లో ప్రధానోపాధ్యాయుడు శంకర్, కరస్పాండెంట్ మురళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎస్ఆర్ ప్రైమ్ పాఠశాలలో విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. జోనల్ ఇన్‌చార్జి దేవిదాస్, ప్రిన్సిపాల్ ప్రేమ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ప్రశాంత్, రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వాసవి వరల్డ్ స్కూల్‌లో అమ్మవారికి బోనాన్ని నైవేద్యంగా సమర్పించారు. పాఠశాల సెక్రెటరీ జగదీశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శైలజాయ్యన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వశిష్ట ఇంపల్స్‌లో విద్యార్థులు అమ్మవారు, పోతరాజు వేషధారణలో ఆకట్టుకున్నారు. చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, ప్రిన్సిపాల్ మాధవి, దేవిదాస్, ఉపాధ్యాయులు ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ అక్షర ఉన్నత పాఠశాలలో బోనాల పండుగ నిర్వహించారు. విద్యార్థులు బోనాలు ఎత్తుకొని నృత్యాలు చేశారు. పాఠశాల డైరెక్టర్లు నరేశ్‌రెడ్డి, రాజారెడ్డి ప్రిన్సిపాల్ సుధాకర్, రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. లక్ష్మణచాందలోని ద్రోణ ఉన్నత పాఠశాలలో బోనాల పండుగ నిర్వహించారు. కరస్పాండెంట్ సురేశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ గంగాధర్, ఉపాధ్యాయులు ముత్యం, శ్రీనివాస్ పాల్గొన్నారు.



లక్ష్మణచాందలోని ద్రోణ ఉన్నత పాఠశాలలో..

కుభీర్: మండల కేంద్రంలోని చాణక్య సంస్కృతి పాఠశాల(ఇంగ్లీషు మీడియం)లో విద్యార్థులు బోనాల పండుగ నిర్వహించారు. ప్రిన్సిపాల్ పి.నరేశ్, కరస్పాండెంట్ పి.సతీశ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ముధోల్: మండల కేంద్రంలోని అక్షర పాఠశాలలో బోనాల ప్రత్యేకతను డైరెక్టర్ సుభాశ్ వివరించారు. ఉపాధ్యాయులు సాయికుమార్, మధుసిందే, అనిల్, విజయ్‌కుమార్, సంతోష్ మహేందర్ ఉన్నారు.

తానూరు: మండలంలోని హిప్నెల్లి ఆర్యభట్ట పాఠశాలలో బోనాల పండుగ నిర్వహించారు. ఉపాధ్యాయులు హన్మాండ్లు, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కుభీర్‌లో..

కుంటాల: మండలంలోని కల్లూర్ వాసవి ఉన్నత పాఠశాలలో బోనాల పండుగ నిర్వహించారు. ప్రిన్సిపాల్ సాయిలు, శ్రీనివాస్, డైరెక్టర్లు జానకీరాం, హరిప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టండి

ఖానాపూర్: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో చర్యలు చేపట్టాలని ఎంపీడీవో సునీత అన్నారు. శనివారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లించి వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ పనులు చేపట్టాలని పేర్కొన్నారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటాలని ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీవో రత్నాకర్‌రావు తదితరులున్నారు.

ఖానాపూర్: గ్రామాల్లో పారిశుధ్య పనులను పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం చేయవద్దని ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని కొలాంగూడ, ఎర్వచింతల్, బీర్నంది గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు.



భైంసారూరల్: మాట్లాడుతున్న ఎంపీడీవో

కార్యక్రమంలో ఆయా గ్రామాల సిబ్బంది ఉన్నారు.

భైంసారూరల్: గ్రామాల్లో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు, ఉపాధిహామి సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో వనమహోత్సవం లక్ష్యం పూర్తి చేయాలన్నారు. ఇప్పటివరకు నాటిన మొక్కల వివరాలను సేకరించారు. మురికి కాలువలను శుభ్రపరిచి గ్రామస్తులకు క్లోరినేషన్ నీటిని అందించాలని ఆదేశించారు. ఎంపీవో మోజం హుస్సేన్, ఈజీఎస్ ఏపీఓ శివలింగం, కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.



కొలాంగూడలో పనులు పరిశీలిస్తున్న ఎంపీవో

కుంటాల: పరిశుభ్రత పాటిస్తేనే రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటామని ఎంపీడీవో ఎంఏ రహీం పేర్కొన్నారు. మండలంలోని అందాకూర్ గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. మురికినీటి గుంటల్లో ఆయిల్ బాల్స్ వేయించారు. వారి వెంట కార్యదర్శి రమ్య, నారాయణ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

మున్సిపల్ చైర్మన్ పర్యటన

నిర్మల్‌టౌన్: పట్టణంలోని పలు వార్డుల్లో శని వారం మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ పర్యటించారు. గాయత్రీపురం వెళ్లే రోడ్డు మార్గంలో వర్షపునీరు నిలిచి కాలనీవాసులకు ఇబ్బందిగా మారడంతో చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కౌన్సిలర్లు అన్వర్ పాష, పోశెట్టి, తదితరులు ఉన్నారు.

నిజాయతీ చాటిన కండక్టర్

నిర్మల్ టౌన్: ఆర్టీసీ బస్సులో పొగొట్టుకున్న రూ.15 వేల విలువైన ఫోన్‌ను తిరిగి ప్రయాణికురాలికి అప్పగించి కండక్టర్ చిన్నయ్య నిజాయతీ చాటుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. శుక్రవారం రాత్రి 8:30గంటలకు నిజామాబాద్ నుంచి నిర్మల్ వచ్చే బస్సులో ఓ ప్రయాణికురాలు నిజామాబాద్‌లో ఎక్కి ముప్కల్‌లో దిగిపోయింది. బస్సులో ఫోన్‌ను గమనించిన కండక్టర్ అందులోని వివరాల ఆధారంగా ప్రయాణికురాలు తేజను నిర్మల్ బస్టాండ్‌కు పిలిపించి ఫోన్ అందించారు.

పరామర్శ

సోన్: మండలంలోని న్యూబొప్పారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సజ్జల నర్సారెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. శనివారం జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు, న్యాయవాది అల్లూరి కృష్ణవేణి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. కాంగ్రెస్ నిర్మల్ మండల అధ్యక్షులు ఎంబరి గంగాధర్, నాయకులు ఉన్నారు.

సన్మానం

కుభీర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థి లక్ష్మణ్ ఇటీవల పీఈటీ ఉద్యోగం సాధించి మహబూబ్‌నగర్ జిల్లాలో పనిచేస్తున్నారు. ఈయనను శనివారం కుభీర్‌లో కళాశాల అధ్యాపకులు సన్మానించారు. ప్రిన్సిపాల్ సునీల్, అధ్యాపకులు సంపత్, భాస్కర్, రమేశ్, శివరాజ్, మహేశ్, మాధవి, లింగయ్య, శివరాజ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ముధోల్: మండలంలోని తరోడా గ్రామస్తులు శనివారం నూతన తహసీల్దార్ శ్రీకాంత్‌ను ఘనంగా సన్మానించారు. తరోడా మాజీ సర్పంచ్ రవికిరణ్, మాజీ ఎంపీటీసీ గంగాధర్ తదితరులున్నారు. ఇటీవల ఈవోగా బాధ్యతలు స్వీకరించిన ప్రసాద్ గౌడ్‌ను పంచాయతీ కార్మికులు సన్మానించారు.

లింబా(కే)లో..

కుంటాల: మండలంలోని లింబా(కే) ప్రాథమిక పాఠశాలలో పని చేసిన హెచ్ఎం గిరినాథ్, ఉపాధ్యాయులు సాయన్న, అనురాధ ఇటీవల బదిలీపై వెళ్లారు. శనివారం పాఠశాలలో వీరిని గ్రామస్తులు సన్మానించారు. మాజీ సర్పంచ్‌లు, హెచ్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శిక్షా సప్తాహ్

నిర్మల్‌రూరల్: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్మల్‌లోని మంజులాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏకో క్లబ్ ఫర్ మిషన్ లైఫ్ స్కూల్ న్యూట్రిషన్ డే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ, వాతావరణ కాలుష్యాల నివారణ తదితర పోస్టర్లను తయారు చేసి ప్రదర్శించారు. ప్లాస్టిక్ వ్యర్థాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను ఉపాధ్యాయులు.. విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్ఎం సిద్ధపద్మ, ఉపాధ్యాయులు సంతోష్, రాజేందర్, శ్రీనివాస్, సురేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాసర: మండలంలోని కిర్గుల్(కే) ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులతో కొత్త ఎకో క్లబ్ ఏర్పాటు చేశారు. ప్లాంట్ ఫర్ మదర్ క్యాంపెయిన్లో భాగంగా విద్యార్థులు తమ తల్లులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భవాని, రాంమోహన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నిర్మల్‌రూరల్: మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

ఛత్రపతి సాహు మహరాజ్‌కు నివాళి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలో శనివారం రిజర్వేషన్ల పితామహుడు ఛత్రపతి సాహు మహరాజ్ జయంతిని బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి జగన్‌మోహన్ మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహరాజ్ మనమడు ఛత్రపతి సాహూ మహరాజ్ రిజర్వేషన్ల పితామహుడని.. తాను పాలించిన కొల్లాపూర్ సంస్థానంలో 1902లో 50 శాతం రిజర్వేషన్లు ప్రకటించి చారిత్రక నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. రిజర్వేషన్ల కొనసాగింపుగా రాజ్యాంగంలో అంబేద్కర్ నిమ్నస్థాయి వర్గాలకు, మహిళలకు రిజర్వేషన్లు కల్పించారన్నారు. ఆ పార్టీ జిల్లా మహిళా కన్వీనర్ ఎస్కే.లక్ష్మీయాదవ్, సఫియాన్ సలీం, రాజేశ్వర్, బుజ్జమ్మ, కోమలి, గీత పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

అబ్దుల్ కలాం సేవలు మరువలేనివి



కుంటాలలో నివాళులర్పిస్తున్న విద్యార్థులు



కడెం: లింగాపూర్‌లో నివాళులర్పిస్తున్న నేతలు

కుంటాల: రాష్ట్రపతి పదవికి వన్నెతెచ్చిన మహానుభావుడు అబ్దుల్ కలాం సేవలు మరువలేనివని పలువురు పేర్కొన్నారు. శనివారం కుంటాల శాంతినికేతన్ పాఠశాలలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంతోష్, డైరెక్టర్ ప్రవీణ్, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామంలో శనివారం మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి నిర్వహించారు. కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో కాంగ్రెస్ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు తరి శంకర్, మహమ్మద్ సలీం, లక్ష్మణ్, రాజేందర్, అబ్దుల్ వహీద్, బాబర్, మల్లారెడ్డి తదితరులున్నారు.

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం మాఅమ్మ–నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి నిర్వహించారు. కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిచారు. నాయకులు మంద భాస్కర్, ప్రకాశ్, చిన్నారెడ్డి ఉన్నారు.

రోడ్డు బాగు చేయాలని నిరసన

కుంటాల: తమ గ్రామంలో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలని మండలంలోని లింబా(కే) గ్రామస్తులు శనివారం వరినాట్లు వేసి వినూత్నంగా నిరసన తెలిపారు. గ్రామంలో చిన్నపాటి వర్షాలకే తారురోడ్డు చిత్తడిగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈరోడ్డు గుండా లింబా(బి), ఓలా, సూర్యాపూర్, కుంటాలతోపాటు భైంసా, వానల్‌పాడ్ తదితర గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని.. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు వేడుకున్నారు.



నాటు వేస్తూ నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించండి

నర్సాపూర్(జి): గ్రామాల్లో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా సిబ్బంది అవగాహన కల్పించాలని నిర్మల్‌రూరల్ సీఐ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను శనివారం సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఈసందర్భంగా కేసుల వివరాలను ఎస్సై హన్మాండ్లును అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తూ కొత్త చట్టాలపై అవగాహన తెచ్చుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎస్సై హన్మాండ్లు, కానిస్టేబుళ్లు గోవింద్, రవీందర్, మహేందర్, జెలాలుద్దీన్, అన్వర్, సందీప్, కృష్ణ, సురేశ్, సంతోషి పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న రూరల్ సీఐ శ్రీనివాస్

పన్నుల వసూలు వేగవంతం చేయండి

కుభీర్: గ్రామాల్లో ఇంటిపన్నుల వసూలును వేగవంతం చేయాలని డీఎల్‌పీవో సుధాకర్‌పటేల్ అన్నారు. శనివారం ఆయన కుభీర్, చొండి గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య పనులు, రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. పరిసరాలతో పాటు వాటర్‌ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వారి వెంట ఎంపీడీవో మోహన్‌సింగ్, కుభీర్ ఈవో రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న డీఎల్‌పీవో సుధాకర్

ఈరోజు

వర్షావాజ్‌కు హాజరుకావాలి

తానూరు: భైంసాలోని టెక్డి బుద్ధవిహార్‌లో ఆదివారం నిర్వహించే వర్షావాజ్‌కు భారతీయ బౌద్ధ మహాసభ సభ్యులు హాజరవాలని భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు రమేశ్‌బాబు వాగ్మారే శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా మండలాల భారతీయ బౌద్ధమహాసభ అధ్యక్షులు, సభ్యులు రావాలని కోరారు.

బీజేపీ కార్యకర్తల సమావేశం

లోకేశ్వరం: మండల కేంద్రంలోని వేంకటేశ్వర కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 11 గంటలకు మండలస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు బీజేపీ మండల కన్వీనర్ జయసాగర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ హాజరవుతారని.. కార్యకర్తలు సకాలంలో రావాలని కోరారు.

ఫ్రూట్స్ ‘డే’

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని విస్డం స్మార్ట్ స్కూల్‌లో శనివారం ఫ్రూట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తాజా పండ్లు తింటే కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు. హెచ్ఎం సునీత, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.